దశకి చేరుకుంటున్న అతనితో కొందరు భక్తులు చెప్పారు.

"స్వామీ. ఢిల్లీలో చాలా పెద్ద అధునాతన హాస్పిటల్ వుంది. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్తాం. తగిన చికిత్స చేసి మిమ్మల్ని బ్రతికిస్తారు."

"ఢిల్లీలో ఎవరూ చావరా?" నవ్వుతూ ప్రశ్నించాడా యోగి.

వాళ్ళతో ఆ హాస్పటల్‌కి వెళ్ళకుండా తన కుటీరంలోనే ప్రాణాలు వదిలాడాయన. ప్రాణాలు నిలుపుకోడానికి జ్ఞానులు ప్రయత్నించరు.

## 27. కానుక

అమెరికా నించి వచ్చిన మిషనరీలలో ఒకరు తిరిగి తమ దేశానికి వెళ్ళిపోతున్నాడని తెలుసుకున్న సింహళ దేశానికి చెందిన ఓ భక్తుడు, అతనికి చక్కటి బహుమతిని ఇవ్వాలనుకున్నాడు. బాగా బీదవాడైన ఆ భక్తుడు నాలుగు రోజులపాటు నడిచి ఆ మిషనరీ దగ్గరకి వెళ్ళి అతనికి నాలుగు కొబ్బరి కాయలు ఇచ్చి చెప్పాడు.

"ఇవి మా దొడ్లో కాసినవి."

అతను చాలా దూరం నించి వచ్చిన సంగతి గుర్తించిన ఆ మిషనరీ కొద్దిగా ఆశ్చర్యంగా చెప్పాడు.

"బిడ్డా! నువ్వు ఈ నాలుగు కొబ్బరి కాయలు నాకు కానుకగా ఇవ్వడానికి అంత దూరం నించి నడిచి వచ్చావా?"

"నా నాలుగు రోజుల నడక కూడా నా కానుకలో భాగం." భక్తిగా చెప్పాడా భక్తుడు.

## 28. గ్రాహ్యం

"స్వామీ. మీరెంతకాలంగా ఈ గుహలో ఉంటున్నారు?"

"నాకు గుర్తులేనంతకాలంగా."

"ఎందుకని?"

"అది తెలుసుకోడానికే."

"అదంటే?"

"చెట్లు ఊహించుకో."

"ఊహించుకున్నాను."

"నక్షత్రాలని కూడా."

"వాటినీ ఊహించుకున్నాను."

"రాముడ్ని?"

"ఊహించుకున్నాను."

"బావుంది. ఇప్పుడు లబ్ డబాయ్‌ని ఊహించుకో."

"దేన్ని స్వామీ?"

"లబ్ డబాయ్‌ని."

"నేనెప్పుడూ దాన్ని చూడలేదు స్వామీ. ఎలా ఊహించుకోగలను?"

"అంటే నువ్వు చూసినదాన్నే కదా నువ్వు ఊహించుకోగలిగేది? అలాగే నేను రాముడిగా, కృష్ణుడిగా రూపం దాల్చిన ఆ నిరాకార బ్రహ్మాన్ని దర్శించే ప్రయత్నంలో ఉన్నాను. ఆ సాధనలో భాగంగా ఈ గుహలో ఏకాంతంగా నివశిస్తున్నాను."

"ఇప్పుడర్థమైంది స్వామి."

## 29. పలకరింపు

తపస్సంపన్నుడైన ఓ సాధువు తన రాజ్యంలోకి వచ్చాడని ఓ రాజుగారికి తెలిసింది. వెంటనే తన పరివారంతో ఆయన దర్శనార్ధం వెళ్ళాడు.

అయితే, ఆ సాధువు రాజుగారిని పట్టించుకోకుండా అతని వెంటవచ్చిన మందీ మార్బలంలోని వాళ్ళ యోగ క్షేమాలని విచారించాడు. సాధువు ఎంతకీ తనతో మాట్లాడక పోవడంతో అవమానంతో రాజుగారు వెనక్కి